పెట్రోలు బంకుల్లో సౌకర్యాలేవీ..?

- నిర్లక్ష్యంగా నిర్వాహకులు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- వినియోగదారులు ప్రశ్నిస్తే వారిపై సిబ్బంది జులుం



అంబాజీపేటలో పెట్రోల్ బంక్



అలంకార ప్రాయంగా గాలి పట్టే మెషీన్

అంబాజీపేట: వాహనదారులకు పెట్రోలు బంకుల్లో కనీస సౌకర్యాల కల్పించడంలో నిర్వాహకులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలోనా నాలుగు మండలాల్లో ద్విచక్ర వాహనాలు నడిపే వారి సంఖ్య బాగా పెరిగింది. కుటుంబానికి రెండు ద్విచక్ర వాహనాల వరకు ఉన్నాయి. పెరిగిన వాహనాల సంఖ్యకు దీటుగా పట్టణంలో పెట్రోలు బంకులు వెలిశాయి. కొన్ని బంకుల్లో వాహనదారులకు తాగునీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేయడం లేదు. వాహనాలకు ఉచితంగా గాలి పెట్టాలనే నిబంధనను గాలికొదిలేశారు. వాహనదారులు మరుగుదొడ్లు ఉన్నాయా అని అడిగితే బంకుల నిర్వాహకులు సరైన సమాధానం ఇవ్వడం లేదు. రాత్రి వేళల్లో సుదూర ప్రాంతాల నుంచి ప్రయాణాలు చేసే వారికి బంకుల్లో వాహనాల పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేయడం లేదు. దీంతో రాత్రి వేళల్లో కార్లు, లారీల్లో ప్రయాణాలు చేసే వారు చేసేదేమీ లేక ప్రయాణాలు కొనసాగిస్తూ నిద్రమత్తులో ప్రమాదాల బారిన పడుతున్నారు. కొంత మంది అయితే రహదారుల పక్కనే నిలిపి వేసి విశ్రాంతి తీసుకుంటున్నారు. అంబాజీపేటలో 3, పి.గన్నవరంలో 4, మామిడికుదురులో 6, అయినవిల్లిలో 3 పెట్రోల్ బంకులు ఉన్నాయి. నాలుగు మండలాల్లో సుమారుగా నిత్యం సుమారు 50 వేలకు పైబడి వివిధ రకాల వాహనాలు పెట్రోల్ బంకులకు వెళుతూ ఉంటాయి. కొన్ని పెట్రోల్ బంకుల వద్ద పెట్రోల్, డీజిల్ సరిగ్గా కొట్టడం లేదని, నాణ్యత లోపిస్తుందని ఆరోపనలు వస్తున్నా ఏ అధికారి పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్రోల్ బంకులపై తనిఖీ చేసే అధికారుల పర్యవేక్షణ కొరవడిందని వాహనదారులు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

నిబంధనలు ఇలా..

ప్రతి పెట్రోలు బంకులో వాహనదారుల సౌకర్యార్థం తాగునీటి వసతి, మరుగుదొడ్ల ఏర్పాటు, వాహనాలకు ఉచితంగా గాలి పెట్టడం, ఫైర్‌కు సంబంధించి పరికరాలు ఏర్పాటు చేయాలి. రాత్రి వేళల్లో ప్రయాణించే వారు విశ్రాంతి తీసుకొనేందుకు, వాహనాల నిలుపుదలకు హమ్మింగ్ ప్రదేశం ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ అంబాజీపేట, పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి మండలంలోని పెట్రోలు బంకుల్లో ఈ తరహా సౌకర్యాలు మచ్చుకైన కనిపించవు. కనీస సౌకర్యాల కల్పన గురించి ఎవరైనా వాహన యాజమానులు ప్రశ్నిస్తే బంకుల్లోని సిబ్బంది వారితో వాదనకు దిగుతున్నారు. బంకుల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు గురించి ఏ శాఖ అధికారులకు ఎలా ఫిర్యాదు చేయాలో తెలియక వాహన చోదకులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. అధికారులు స్పందించి పెట్రోల్ బంకుల్లో కనీస సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

సౌకర్యాలు లేకుంటే చర్యలు



పెట్రోల్ బంకుల్లో వినియోగదారుల సౌకర్యార్థం కనీస సౌకర్యాలు కల్పించాలి. నిబంధనల ప్రకారం ప్రతి పెట్రోల్ బంకులో వాహనాలకు ఉచితంగా గాలి పట్టేందుకు మెషీన్, మరుగుదొడ్లు, తాగునీరు, పార్కింగ్ సౌకర్యం కల్పించాలి. సౌకర్యాలు కల్పించకుండా వాహన చోదకులను ఇబ్బందులకు గురి చేస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

– జగతా వెంకటేశ్వరి, తహసీల్దార్, అంబాజీపేట

ఉపాధ్యాయిని కుటుంబానికి చెక్కు అందజేత



పి.గన్నవరంలో ఉపాధ్యాయిని కుటుంబానికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్సీ ఐవీ

పి.గన్నవరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న యనమంద్ర అన్నపూర్ణ ఇటీవల మరణించడం తీరని లోటని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఆమె కుటుంబానికి యూటీఎఫ్ సంక్షేమ నిధి ద్వారా రూ.3 లక్షల చెక్కు ద్వారా గురువారం ఆయన అందజేశారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్‌ఎం డీఎస్‌వీ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన అన్నపూర్ణ సంస్మరణ సభలో ఎమ్మెల్సీ మాట్లాడారు. అన్నపూర్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యాభివృద్ధికి ఆమె అందించిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమాల్లో యూటీఎఫ్ రాష్ట్ర ప్రతినిధి నల్లి విశ్వనాథ్, జిల్లా అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు, నాయకులు దూనబోయిన రామకృష్ణ, గిడ్ల శ్రీనివాస్, వరిగేటి రత్నం, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న ఓ విద్యార్థిని తండ్రి

కొత్తపేట: విద్యార్థులు ఉన్నత భవిష్యత్ సాధనలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అన్నారు. గురువారం సాయంత్రం కళాశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత ఉద్యోగాలు పొందే విధంగా వారికి రెగ్యులర్ క్లాసులతో పాటు కెరీర్ ఓరియంటెడ్ కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు కళాశాలలో తీసుకుంటున్న చర్యలను వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలు కాలేజ్‌కు వెళుతున్నారు. చదువుకుంటున్నారులే.. అని సరిపెట్టుకోకుండా కళాశాలలో విద్యాబోధన ఎలా ఉంది? మన పిల్లలు బాగా చదువుతున్నారా? క్రమశిక్షణగా ఉంటున్నారా? మార్కులు ఎలా వస్తున్నాయన్న అంశాలపై ప్రత్యేకశ్రద్ధ చూపాలని కోరారు. అందుకు కళాశాలలో నిర్వహించే తల్లిదండ్రుల సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావలని కోరారు. ఇంకా పలు చూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, అధ్యాపకులు జి.శ్రీనివాసులు, పాపారావు, కె.సత్యనారాయణ, వి.నాగదీపిక తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక లైసెన్స్ తీసుకోవాలి



అంబాజీపేటలో బాణసంచా విక్రయదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వరి

అంబాజీపేట: దీపావళి పండుగ సందర్భంగా మండలంలోని గ్రామాల్లో బాణసంచా వ్యాపారం చేయాలనుకునే వ్యాపారులు తాత్కాలిక లైసెన్సు కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ జె.వెంకటేశ్వరి అన్నారు. అంబాజీపేట మండల తహసీల్దార్ కార్యాలయంలో బాణసంచా విక్రయదారులతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. లైసెన్స్ కోసం దరఖాస్తుతో పాటు దరఖాస్తుదారు ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఒరిజినల్ చలానా, జీఎస్టీ రశీదు జతపరచాలని పేర్కొన్నారు. ఇవన్నీ జతచేసిన దరఖాస్తులను మాత్రమే విచారణ చేసి లైసెన్సు మంజూరు కోసం కొత్తపేట ఆర్డీవో కార్యాలయానికి సిఫారసు చేస్తామని స్పష్టం చేశారు. తాత్కాలిక లైసెన్సు లేకుండా బాణసంచా వ్యాపారం చేయకూడదన్నారు. లైసెన్స్ లేకుండా బాణసంచా అమ్మితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రమాద రహిత దీపావళికి చర్యలు



దీపావళి జాగ్రత్తలపై అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ శ్రీకర్

కొత్తపేట: దీపావళి బాణసంచా తయారు, విక్రయాల సందర్భంగా ఏ విధమైన ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ పి.శ్రీకర్ అధికారులకు సూచించారు. వచ్చే దీపావళి పురస్కరించుకుని గురువారం సాయంత్రం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, ఎస్సైలు, సీఐలు, అగ్నిమాపక, కార్మిక శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాత్కాలిక బాణసంచా దుకాణాలు నిర్దేశించిన ప్రదేశాల్లోనే ఏర్పాటు చేసుకుని విక్రయాలు సాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయిలో రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక అధికారుల త్రిసభ్య కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు పర్యటిస్తూ తయారీ, విక్రయ కేంద్రాల లైసెన్స్‌లు, వాటికి అనుగుణంగా బాణసంచా పరిమితి, నిబంధనలు పాటిస్తున్నారా? ఎటువంటి అనధికార నిల్వలు లేకుండా తద్వారా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనధికారికంగా తయారు చేయడం, పరిమితికి మించి నిల్వలు ఉన్నా, అనధికారిక గొడౌన్లలో సరుకు పెట్టడం వంటి నిబంధనలు అతిక్రమిస్తే ఏ మాత్రం ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించాలని సూచించారు.

బీకేఎస్ మండల సమావేశం



పుల్లేటికుర్రులో సమావేశమైన బీకేఎస్ నాయకులు

అంబాజీపేట: భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) మండల శాఖ అధ్యక్షుడిగా కొప్పిశెట్టి ఆనంద వెంకట ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పుల్లేటికుర్రు సొసైటీ కార్యాలయంలో బీకేఎస్ మండల సమావేశం జరిగింది. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా అయ్యగారి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా మట్టపర్తి భాస్కరరావు, మేడేపల్లి వెంకటేశ్వరరావు, నిట్టల సాయి, మట్టపర్తి రాంబాబు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో బీకేఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎస్‌బీహెచ్‌ఎం మెంబర్ ముత్యాల జమ్మీలు, జిల్లా అధ్యక్షుడు యాళ్ల వెంకటానందం, శ్రీ వ్యాఘ్రేశ్వర ఐక్య రైతు సంఘ ప్రధాన కార్యదర్శి అడబాల రాజారావు, అడబాల రాజమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలతో మహేష్‌బాబుకు కృతజ్ఞతలు



కత్తులవారిపేటలో మహేష్‌బాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

పి.గన్నవరం: ఎంబీ ఫౌండేషన్ ద్వారా తమ కుమార్తెకు ఉచితంగా గుండె ఆపరేషన్ చేయించిన సినీ హీరో మహేష్‌బాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ 'మా దేవుడు నువ్వే స్వామీ' అంటూ ఓ కుటుంబం పి.గన్నవరం శివారు కత్తులవారిపేటలో ఫ్లెక్సీలు కట్టారు. దీంతో మహేష్‌బాబు సేవా దృక్పథాన్ని చాటుతూ గ్రామంలో పలుచోట్ల ఆయన అభిమానులు కట్టిన ఫ్లెక్సీలు వైరల్‌గా మారాయి. కత్తులవారిపేటకు చెందిన వ్యవసాయ కూలీ నాగాబత్తుల తాతాజీకి భార్య జ్యోతి, ఐదేళ్ల కుమారుడు రిషివర్ధన్, రెండేళ్ల పాప రిత్విక ఉన్నారు. రిత్విక గుండెకు రంధ్రం పడటంతో ఆపరేషన్ చేయాల్సి వచ్చింది. ఆపరేషన్‌కు రూ.3 నుంచి 5 లక్షల వరకూ ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పడంతో ఈవిషయం తెలుసుకున్న అమలాపురానికి చెందిన మహేష్‌బాబు అభిమాన సంఘ నాయకుడు కె.నర్సింహస్వామి మహేష్‌బాబు ఫౌండేషన్ ద్వారా విజయవాడ ఆంధ్రా హాస్పిటల్‌లో ఇటీవల చిన్నారి గుండెకు ఉచితంగా ఆపరేషన్ చేయించారు. ఇంటికి వచ్చిన ఆ కుటుంబం మహేష్‌బాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఫ్లెక్సీలు కట్టారు.

కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి తరలిరావాలి

రావులపాలెం: విజయవాడలో జరిగే కాంగ్రెస్ పార్టీ జిల్లాల వారీ సమావేశానికి కార్యకర్తలు తరలిరావాలని అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు అన్నారు. స్థానిక చాంబార్ ఆఫ్ కామర్స్ భవనంలో కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జి రౌతు ఈశ్వరరావు అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి సమావేశం గురువారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈనెల 26న అంబేడ్కర్ కోనసీమ జిల్లా కార్యకర్తల సమావేశం విజయవాడలో జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి భారీగా కార్యకర్తలు అభిమానులు తరలిరావాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షురాలిగా లక్ష్మి



ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మిని అభినందిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం: మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షురాలిగా నరేంద్రపురం ఎంపీటీసీ సభ్యురాలు కొక్కిరి లక్ష్మి గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమె పి.గన్నవరంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెను ఎమ్మెల్యే గిడ్డితో పాటు ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి, ఎంపీటీసీలు, కూటమి నాయకులు తదితరులు అభినందించారు.

గూడపల్లిలో ఆర్డీఓ పర్యటన

మలికిపురం: మండలంలోని గూడపల్లిలో గురువారం అమలాపురం ఆర్డీఓ కె.మాధవి పర్యటించారు. స్థానిక పాఠశాలలో తాగునీటి సౌకర్యాలను ఆమె పరిశీలించారు. విద్యార్థులతో ఆమె మాట్లాడారు. ఆమె వెంట తహసీల్దార్ టి.శ్రీనివాస్ ఎంపీడీఓ ఎస్.బాలాజీ, ఎంఈఓ ఎం.విజయశ్రీ పాల్గొన్నారు.

కొబ్బరి పరిశోధనలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త గోవర్ధనరావు

అంబాజీపేట: స్థానిక ఉద్యాన పరిశోధన కేంద్రంలో కొబ్బరి, కోకో, తదితర పంటలపై చేపడుతున్న పరిశోధనలపై పదో తరగతి విద్యార్థులకు కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ వి.గోవర్ధనరావు అవగాహన కల్పించారు. ఐ.పోలవరం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 52 మంది పదో తరగతి విద్యార్థులు అంబాజీపేట పరిశోధన కేంద్రాన్ని గురువారం సందర్శించారు. కొబ్బరి, కోకో పంటలపై వ్యాపించే తెగుళ్లు, పురుగులు, యాజమాన్య పద్ధతులను విద్యార్థులకు గోవర్ధనరావు వివరించారు. పరిశోధన కేంద్రంలో ఉన్న విభాగాలకు చెందిన పరిశోధన శాలలు, క్షేత్రస్థాయిలో కొబ్బరి, కోకో పంటలపై అవగాహన కల్పించారు. అంతకుముందు కొబ్బరి పరిశోధన కేంద్రం ప్రాధాన్యతను విద్యార్థులకు విపులంగా వివరించారు. ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు ఎం.శాంతికుమార్, జి.రమ్య, కె.సతీష్ పాల్గొన్నారు.

ఆలమూరులోని ప్రధాన బ్యాంకులు, కార్యాలయాల ఫోన్ నంబర్లు

కార్యాలయం/బ్యాంకు పేరు	గ్రామం	ఎస్‌టీడీ కోడ్	ఫోన్ నంబర్
పోలీసు స్టేషన్	(ఆలమూరు)	08855	278433
సబ్ రిజిస్ట్రార్	(ఆలమూరు)	08855	278235
సబ్ ట్రెజరీ	(ఆలమూరు)	08855	278418
వ్యవసాయ మార్కెట్ కమిటీ	(ఆలమూరు)	08855	278298
యాక్సిస్ బ్యాంక్	(ఆలమూరు)	08855	279433
యూనియన్ బ్యాంక్	(ఆలమూరు)	08855	278448
ఇండియన్ బ్యాంక్	(ఆలమూరు)	08855	278440
డీసీసీబీ బ్యాంక్ (బ్రాంచి)	(ఆలమూరు)	08855	278591
బ్యాంక్ ఆఫ్ బరోడా	(పెదపళ్ల	08855	278583
యూనియన్ బ్యాంక్	(జొన్నాడ)	08855	279545
గోదావరి గ్రామీణ బ్యాంక్	(పెదపళ్ల)	08855	294703
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	(మడికి)	0883	2493272
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	(చెముడులంక)	0883	2493560
గోదావరి గ్రామీణ బ్యాంక్	(నర్శిపూడి)	0883	2493510
గోదావరి గ్రామీణ బ్యాంక్	(చొప్పెల్ల)	0883	2493113

క్లుప్తంగా

ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితుడికి వైద్యం కోసం స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు గురువారం రూ.15 వేల చెక్కు అందజేశారు. కొత్తపేట మండలం గంటి గ్రామానికి చెందిన కరుపోతు రమేష్ ఈతకోట టోల్ ప్లాజాలో పని చేస్తున్నారు. వారం రోజుల క్రితం డ్యూటీకి వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలియో ఉన్న కాలు విరిగిపోయింది. ప్రస్తుతం సర్జరీ చేసి రాడ్లు వేశారు. ఇంకో సర్జరీ చేయాల్సి ఉంది. పనికి వెళితే కానీ కుటుంబం గడవని పరిస్థితి. దీంతో కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. రమేష్ భార్య భాగ్యలక్ష్మికి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.15 వేల చెక్కు అందజేశారు.

తాచుపాము హల్‌చల్



తాచుపామును పట్టుకుంటున్న స్నేక్‌క్యాచర్ వర్మ

అంబాజీపేట: కొబ్బరి గొడౌన్‌లో ఓ తాచుపాము ప్రవేశించి అక్కడ ఉన్నవారందరినీ భయపెడుతూ హల్‌చల్ చేసింది. మాచవరంలో ప్రకాష్ ట్రేడర్స్‌కు చెందిన కొబ్బరి గొడౌన్‌లో తాచు పాము కొబ్బరి కాయల్లో బుసలు కొడుతూ అక్కడ పని చేసే కొబ్బరి కార్మికులను భయభ్రాంతులకు గురిచేసింది. దాంతో భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం ఇచ్చారు. వర్మ పామును చాకచక్యంగా పట్టుకుని ప్లాస్టిక్ డబ్బాలో బంధించి జనసంచారానికి దూరంగా వదిలిపెట్టారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేసిన సర్పంచ్ తదితరులు

రాజోలు: చింతలపల్లిలో నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి గురువారం భూమి పూజ చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3.80 లక్షలతో పనులు చేపట్టామన్నారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ నిధులు కేటాయించడంపై సంతోషం వ్యక్తం చేశారు. మండల ఉపాధ్యక్షుడు ఇంటిపల్లి ఆనందరాజు, ఉప సర్పంచ్ బొక్కా రామకృష్ణ, నాయకులు పంగం తాతాజీ, పిప్పళ్ల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఆధార్ కేంద్రాలు

అంబాజీపేట: ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆయా గ్రామాల సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జి.సరోవర్ అన్నారు. ముక్కామల సచివాలయంలో గురువారం ఆధార్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఇతర రోజుల్లో అయితే ఎక్కడ ఆధార్ కేంద్రం ఉంటే అక్కడికి వెళ్లాల్సి వచ్చేదన్నారు. కానీ ఇప్పుడు మన ముంగిటకే ఆధార్ కేంద్రం రావడం దాని వినియోగించుకోవడం మన బాధ్యత అన్నారు. ఆధార్ కార్డు విషయంలో జరిగిన పొరపాట్లు, సమస్యలను తక్షణమే పరిష్కరించుకోవచ్చన్నారు. పేర్లు, చిరునామా, డేట్ ఆఫ్ బర్త్, వేలి ముద్రలు, ఫొటో అప్‌డేట్ వంటి సేవలను పొందవచ్చన్నారు. 15 ఏళ్లు దాటిన వారంతా తప్పకుండా ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు

అంబాజీపేట: వివాహిత తన రెండేళ్ల బాబుతో అదృశ్యమవడంతో అంబాజీపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. మండలంలో తొండవరానికి చెందిన వివాహిత తన రెండేళ్ల బాబుతో ఈ నెల 22వ తేదీ రాత్రి నుంచి కనిపించడం లేదని ఆమె భర్త వి.బాలాజీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 23వ తేదీ ఉదయం ఫోన్ చేసి తన కోసం వెతకవద్దని, అనంతరం ఆమె సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసిందని ఫిర్యాదులో ఆమె భర్త వివరించారని పోలీసులు తెలిపారు. బాలాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ కె.ప్రసాద్ తెలిపారు.

కొండముచ్చుని బంధించిన అటవీ సిబ్బంది

మలికిపురం: మండలంలోని కేశనపల్లిలో కొండముచ్చు కొంత కాలంగా రైతుల్ని ఇబ్బంది పెడుతోంది. రైతులు పెంచుకుంటున్న మేకలపై కూడా దాడి చేసి గాయపరచడంతో అటవీ అధికారులను ఆశ్రయించారు. వైఎస్సార్ సీపీ యూత్ విభాగం నాయకుడు తాడి సహదేవ్ సహకరించి అటవీ సిబ్బందికి సమాచారం అందించడంతో ఫారెస్ట్ అధికారులు గురువారం ఒక బోను అమర్చారు. కొండముచ్చు అందులో పడడంతో సిబ్బంది రాజమహేంద్రవరం పరిసర అడవులకు తరలించారు. గ్రామస్తులు అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు.

29న భూముల కౌలుకు వేలం

మామిడికుదురు: అప్పనపల్లి గ్రామదేవత కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి చెందిన 3.35 ఎకరాల భూమి కొబ్బరిచెట్ల ఫలసాయం తీసుకునేందుకు ఈ నెల 29 మధ్యాహ్నం 3 గంటలకు కౌలు వేలం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ తులా నాగరాజు గురువారం తెలిపారు. 2024–25 నుంచి 2026–27 వరకు మూడేళ్ల కాల పరిమితికి ఈ వేలం నిర్వహిస్తామన్నారు. దేవదాయ, ధర్మదాయ శాఖాధికారుల పర్యవేక్షణలో ఈ వేలం జరుగుతుందన్నారు. పాటదారులు రూ.25 వేలు ధరావత్తు సొమ్ము చెల్లించి, రూ.మూడు లక్షలు విలువైన సాల్వెన్సీ సర్టిఫికెట్‌తో పాటలో పాల్గొనాలన్నారు. ఇతర వివరాల కోసం దేవస్థానం కార్యాలయం పని వేళల్లో సంప్రదించాలని నాగరాజు సూచించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కొత్తపేట: మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ అమలాపురం ఈఈ ఎం.రవికుమార్ గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక 33 కేవీ విద్యుత్ లైన్ పనుల నిమిత్తం కొత్తపేట శివారు పలివెల వంతెన ఏరియా, అవిడి, గంటి, మోడేకుర్రు, గొలకోటివారిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

రావులపాలెంలో..

రావులపాలెం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఈఈ ఎం.రవికుమార్ గురువారం తెలిపారు. రావులపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని కొమరాజులంకలో ఉదయం 9 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే ఈతకోట సబ్ స్టేషన్ పరిధిలో ఇండస్ట్రియల్ ఫీడర్‌కు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

రావులపాలెం: డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యలు తెలుసుకుని నేరుగా పరిష్కరించేందుకు 25వ తేదీ శుక్రవారం డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ గురువారం తెలిపారు. ఉదయం 11.30 నుంచి 12.30 మధ్య సమయంలో 9959225537 మొబైల్ నెంబర్‌కు ఫోన్ చేసి ప్రయాణికులు తమ సమస్యలతో పాటు సలహాలు, సూచనలు తెలియజేవచ్చన్నారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఆత్రేయపురం: మండలంలోని మెర్లపాలెం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సీహెచ్ శ్రీహరి, పీడీ ఎస్.శ్రీకాంత్ తెలిపారు. అండర్–17 విభాగంలో రంకిరెడ్డి కళ్యాణీరేవతి, చింతల అనూష, పి.బాలసురేష్, అనిల్‌కుమార్ ఎంపికయ్యారు. అండర్–14 విభాగంలో బందెల లక్ష్మీపతి, తోట మహాలక్ష్మి, చిన్నం దుర్గా లావణ్య, అండర్–19 విభాగంలో బొలిశెట్టి హిందు ఎంపికయ్యారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వారిని పలువురు అభినందించారు.

అయినవిల్లి ఎంపీడీవోగా భీమారావు

అయినవిల్లి: అయినవిల్లి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా జి.భీమారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. భీమారావు అంబాజీపేట పంచాయతీ విస్తరణాధికారిగా పనిచేస్తున్నారు. ఆయనను కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, పలువురు ప్రజాప్రతినిధులు కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. మండలంలోని సమస్యలకు పరిష్కారం కోసం తాను కృషి చేస్తానని భీమారావు తెలిపారు.

విద్యార్థులకు ఐరన్ సిరప్

ఆలమూరు: మండలంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాలు, ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం ఐరన్ సిరప్ డ్రాప్స్ వేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎనీమియా ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యులు డి.సువర్చలాదేవి, పి.భవానీశంకర్ ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలు పాఠశాలలకు వెళ్లి ఆరు నెలల నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు ఈ డ్రాప్స్ వేశారు. ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివ ప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేయాలి

కొత్తపేట: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కూటమి శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం స్థానిక కాపు కళ్యాణ మండపంలో ఎమ్మెల్యే బండారు ఆధ్వర్యంలో కూటమి పార్టీల నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ పాల్గొన్నారు.